741) పాడి / నాట

ప॥ నరసింహ రామకృష్ణ నమో శ్రీవేంకటేశ। సరుగ నా శత్రుల సంహరించవే॥

చ॥ బావతిట్లకు శిశుపాలుని జంపిన। యేవ కోపకాడవు నేడెందు వోతివి।
నీవాడనని నన్ను నిందించే శత్రువును। చావగొట్టి వాని నిట్టే సంహరించవే॥

చ॥ దాసుని భంగించేటి తరి కస్యపు జంపిన। యీసుకోపగాడ విపు డెందువోతివి।
మేసుల నీలాంఛనాలు మించి నన్ను దూషించే। శాసించి శత్రువును సంహరింపవే॥

చ॥ కల్లలాడి గూబయిల్లు గైకొన్న గద్ద జంపిన। యెల్లగాగ కోపకాడ వెందువోతివి।
యిల్లిదె శ్రీవేంకటేశ యీ నీ మీది పాటలు। జల్లన దూషించు శత్రువు సంహరింపవే॥